# వంశవృక్షం

"**నా** డాక్టరేట్ కోసం 'సామాజిక వ్యవస్థలో వంశ ప్రాముఖ్యత' అనే విషయంపై పరిశోధన జరిపి, థీసిస్ వ్రాద్దామనుకొంటున్నాను. విషయ సేకరణ నీతో మొదలు పెడ్తున్నాను. మీ వంశ పారంపర్యాన్ని గురించి చెప్పు. ఇదిగో స్కాచ్! అదిగో జీడిపప్పు!" అన్నాడు నిరంజన్ గ్లాసుల్లో విస్కీ పోసి, ఐస్ ముక్కలు వేస్తూ.

"మరి నా వంతెప్పుడు?" అని ప్రశ్నించాడు గౌరీపతి గ్లాసందుకొంటూ.

"ఇదిగో వీణ్ణి ఓ రెండు శనివారాలూ, ఆదివారాలూ పీడించిన తర్వాత!" అన్నాడు నిరంజన్ నవ్వుతూ.

నేనూ ముందుకు వంగి, గ్లాసందుకుని, "త్రీ ఛీర్స్ ఫర్ నిరంజన్స్ థీసిస్!" అన్నాను.

గ్లాసులు ఢీ కొట్టి, అందరం మొదటి గుక్క తీసుకొని బల్ల మీద పెట్టాం.

నిరంజన్‌కేసి చూసి, "మా వంశాన్ని గురించి ప్రశ్నలడగబోయే ముందు నీకో కథ చెప్పాలి! థీసిస్ క్కూడా పనికి వస్తుందనుకొంటాను" అన్నాను.

నిరంజన్ 'సరే'నన్నాడు.

కథ మొదలుపెట్టాను.

★ ★ ★

-- దరిద్ర నారాయణులందరూ ఎదురు చూసిన రోజు రానే వచ్చింది. పాలెం, దాని చుట్టుపక్కల గ్రామాల నుంచి చిన్నా పెద్దా, ఆడా, మగా జాతి, మత భేదాలు లేకుండా, మట్టి రోడ్లమ్మటా, పొలం గట్లమ్మటా చీమల బారుల్లా నడుచుకొంటూ వచ్చి, పాలెం ఊరు బయట ఏటి ఒడ్డునున్న మామిడి తోట చేరుకొని, వరుసలు తీర్చి కూర్చున్నారు. ఇరవై మందికి పైగా పెద్ద పెద్ద గుండిగల్లో, మూకుళ్లలో వంటా వార్పూ చేస్తున్నారు.

మరుగుతున్న దప్పళం వాసనలూ, వెదురు బుట్టల్లో కనువిందుగా ఉన్న కూరలూ, గారెలూ, బూర్లు, ఆ అన్నాతురల ఆతృతని మరింత పెంచేశాయి.

తోటకానుకొని ఉన్న పెద్ద మేడలో ముగ్గురు భోక్తలు సుష్టుగా భోజనం చేసి, దక్షిణ తాంబూలాలు పుచ్చుకొని వెళ్ళిన తర్వాత, 'మాణిక్యాంబా సుగర్ మిల్లు' యజమాని వీరభద్రయ్యా, భార్య కమలాదేవీ, తల్లి రాజేశ్వరీ డాబా మీదకు వచ్చారు. వీరభద్రయ్య కింద తోటలో బారులు తీర్చి కూర్చున్న బీద ప్రజలకి చేతులెత్తి నమస్కారం పెట్టి, ఇక కానివ్వండి అన్నట్లుగా స్వయం సేవకులకి సంజ్ఞ చేశాడు. ఒక్కసారిగా తోటలో కలకలం బయలుదేరింది. యింటికి దగ్గరగా కూర్చున్న ఓ నడి వయసు మనిషి లేచి నిల్చుని, "చెరుకు రసం వీరభద్రయ్యగారికీ జై!" అన్నాడు.

"జై!" అన్నారు జనాలు.

"చెరుకు రసం కమలాదేవిగారికి...."

"జై!"

"చెరుకు రసం రాజేశ్వరమ్మగారికి...."

"జై!"

"కీర్తిశేషులు కోటీశ్వర్రావుగారి ఆత్మకి..."

"శాంతి కలగాలి!"

"చెరుకు రసం వారి వంశం పది కాలాల బాటు..."

"వర్ధిల్లాలి!"

స్వయం సేవకులు నడుం కట్టుకొని వడ్డనలు ప్రారంభించారు. ఆకలి కడుపులతో ఉన్న జనాలు ఆ ఒక్కపూట భోజనం కోసం విస్తళ్ళ మీద విజృంభించారు.

"పోయి ఆయనే లోకంలో ఉన్నాడో కాని, ఆయన కొడుకు ధర్మమా అంటూ, పది సంవత్సరాల నుంచీ కనీసం ఏడాదికో పూటైనా భోజనం దొరుకుతోంది. ఇంతమందికి అన్నదానం చేసే వీరభద్రయ్య లాంటి కొడుకుని కన్నందుకు కోటీశ్వర్రావు గారి జన్మ తరించింది", అందో ముసలవ్వ అన్నంలో కూర కలుపుకొంటూ.

పక్కనే కూర్చున్న పదేళ్ళ మనవడు, "వీరభద్రయ్యగారి అమ్మ కూడా చచ్చిపోతే, ఏడాదిలో మరో రోజు కూడా ఆయనిలాగే అన్నదానం చేస్తాడేమో!" అన్నాడు.

"ఛస్! నోరు మూసుకు తిను. ఎవరైనా వింటే తన్ని తగలేస్తారు!" అన్నాడు మరో పక్క కూర్చున్న కుర్రాడి తాత.

మనవడు ఆకులో బూరె తీసుకొని నోట్లో కుక్కుకున్నాడు.

డాబా పిట్ట గోడ దగ్గర నిల్చున్న వీరభద్రయ్య తృప్తిగా నవ్వుతూ తల్లి కేసి చూశాడు. రాజేశ్వరి హృదయం గతుక్కుమంది.

ఇలా అన్న సంతర్పణ భర్త పోయిన పది సంవత్సరాలుగా, కొడుకు వీరభద్రయ్య చేస్తూనే ఉన్నాడు. రాజేశ్వరి హృదయం గతుక్కుమంటూనే ఉంది! ప్రశ్నించుకుంటూనే ఉంది! *'వంశం వర్ధిల్లాలి!'* జనఘోష- *'ఎవరిది?'* - తన ఆత్మ ఘోష.

పెళ్ళయిన ఆరేళ్ళకి కూడా సంతానం కలగకపోవడంతో, రాజేశ్వరి అత్తగారు మాణిక్యాంబ, కొడుకు కోటీశ్వర్రావు చెవి కొరకడం ప్రారంభించింది, మరో పెళ్ళి చేసుకోమని. లేకపోతే వంశం నిలవదనీ, తల కొరివి మాటా, తద్దినాల మాటా దేముడెరుగు కానీ, కనీసం కాసిన్ని తర్పణాలు వదలడానికైనా ఎవరూ ఉండరని బెదిరించసాగింది.

''ఇంకో పెళ్ళి చేసుకొన్నాక తీరా ఆడపిల్లలే పుడితే?'' అని కోటీశ్వర్రావు ఓసారి తల్లిని ప్రశ్నించాడు.

''అసలు సంతే లేదనుకొంటున్నప్పుడు, ఆడ పిల్లలయినా పర్వాలేదు! నీ ఆస్తి పాస్తుల్ని నీ రక్తం పంచుకొని పుట్టిన కూతుళ్లనుభవిస్తారు. అల్లుళ్లు కొరివి పెడ్తారు!'' అంది మాణిక్యాంబ సమాధానంగా.

పరిస్థితి విషమిస్తోందని, రాజేశ్వరి తన తల్లితో మొర పెట్టుకొంది. తల్లి సలహా మీద రాజేశ్వరి భర్తతో పాటు, చెన్న పట్నంలో ఉన్న కంచుపాత్ర కామేశ్వర్రావని ఓ పెద్ద డాక్టరు దగ్గరకు వెళ్ళింది. అసలు లోపం, కోటీశ్వర్రావులో ఉన్నా, చిన్న లోపం, రాజేశ్వరిలో ఉందని చెప్పి వైద్యం మొదలుపెట్టి, ఆ వైద్యం ముసుగులో రాజేశ్వరిని కనికరించాడు కామేశ్వర్రావు. ఇదంతా రాజేశ్వరి తల్లి వెనక నుండి జరిపించిన భాగవతమే! రాజేశ్వరి గర్భం దాల్చి అదృష్టవశాత్తూ, తన పోలికలతో ఓ పండంటి కుర్రాణ్ణి కన్నది.

తల్లి పోలిక కొడుకూ, తండ్రి పోలిక కూతురూ చాలా అదృష్టవంతులవుతారన్న నమ్మకమున్న మాణిక్యాంబ ఎంతగానో మురిసిపోయి, మనవడికి తన భర్త పేరు 'వీర భద్రయ్య' పేరు పెట్టించింది. కాలగర్భంలో అత్తగారూ, భర్తా కలిసిపోయారు. రాజేశ్వరి ఇప్పుడు చెరుకు రసం వారింటికి పెద్ద ఆడ దిక్కు. లోకం దృష్టిలో వీరభద్రయ్య, చెరుకు రసం వారి వంశోద్ధారకుడు! కాని చెరుకు రసం వారి వంశం, కోటీశ్వర్రావుతో అంతమొంది, కంచుపాత్రల వారి వంశవృక్షంలో వీరభద్రయ్యతో ప్రారంభమైన మరో శాఖ అభివృద్ధి చెందుతోందని రాజేశ్వరికే తెలుసు.

రాజేశ్వరి అంతరాంతరాల్లో కొద్దిగా చింతిస్తూ లోపలికి దారి తీసింది. కానీ, తన రక్తమే కాకుండా, పేగులు కూడా పంచుకొని పుట్టిన వీరభద్రయ్య, చెరుకురసం వారి ఆస్తిపాస్తులకు వారసుడయ్యాడని సర్దిపెట్టుకోవడం కూడా అలవాటై పోయింది రాజేశ్వరికి.

కాని రాజేశ్వరి పొరపాటు పడింది. ఎందుకంటే, కంచుపాత్రల కామేశ్వర్రావు తాత తాతగారు శ్యామల్రావు, ఓసారి మేనమామగారి ఊరెళ్ళి, ఆ ఊరి కరణంగారమ్మాయి సుభద్రని చూసి, మోజుపడి పెళ్ళి చేసుకొంటానన్నాడు. ఎగిరి గంతేసి కరణం దంపతులు, అప్పుడే నెల తప్పిన సుభద్రను శ్యామల్రావుకిచ్చి పెళ్ళి చేసేశారు. సుభద్ర చాలా తెలివిగా వ్యవహరించి ఎనిమిదో నెలలో ప్రసవించినట్లుగా భ్రాంతి కలుగచేసి, ఓ వంశోద్ధారకుడికి జన్మనిచ్చింది. వాడి అసలు తండ్రి పేరు గోరువంకల గుర్నాథం. అంటే రాజేశ్వరికి తెలియని విషయమేమిటంటే, నిజానికి కామేశ్వర్రావూ, అతని వలన తనకి కలిగిన వీర భద్రయ్యా గోరువంకల వారి వంశోద్ధారకులని.

రాజేశ్వరికి తెలియని విషయం మరొకటుంది. అదేమిటంటే, రెండు వందల

సంవత్సరాల క్రితం చెరుకురసం శరభయ్యగారని ఆరు వందల ఎకరాల భూస్వామి ఉండేవాడు. ఆయన ఇద్దరు పిల్లల తండ్రయి, తర్వాత క్రమేపీ వ్యవసాయప్పనులలో బాగా మునిగిపోయి, భార్యనంతగా పట్టించుకొనే వాడు కాదు. ఆయనోసారి ఊడ్పుల సమయంలో నాలుగు రోజులింటికి రానప్పుడు, వెండికంచం వెంకటేశ్వర్లని ఓ దూరపు బంధువు రావడం, శరభయ్య భార్య అతనితో శృంగారం జరపడం జరిగిపోయాయి! ఫలితంగా ఓ కొడుకుని కంది. ఆ మూడో సంతానం తాలూకు దిగువ తరాల్లో, కోటీశ్వర్రావు అవతరించాడు. అంటే వీరభద్రయ్య తండ్రిగా చెలామణి అయిన కోటీశ్వర్రావు కూడా, చెరుకురసం వారి వంశం కాదన్నమాట! అంటే రాజేశ్వరి కూడా చెరుకు రసం వారి కోడలు కాదు. వెండికంచం వారి కోడలు.

అయినప్పుడు, అసలు చెరుకు రసం వారి వంశం ఏమైనట్టు? తెలియాలంటే, కాల గర్భంలో కలిసిపోయిన శరభయ్యగారి మొదటి సంతానమైన ఆడపిల్ల మాట మరిచి, రెండో సంతానమైన నాగభైరవ స్వామి నుంచి వెలువడిన శాఖ ఇప్పుడెక్కడుందో, లేదా ఆ శాఖకి కూడా అంటు కట్టబడిందో చూడాలి మరి!

కాల యంత్రంలో పయనిస్తూ ఏ వంశ చరిత్రని వెనక్కి తిరిగి చూస్తూ పోయినా, లేదా ముందుకు నడుపుకుపోయినా, పదులు, వందలు లేదా వేల సంవత్సరాలలో, ఏ ఒక్క యింటి కోడలు హద్దు దాటినా, వంశం సంగతి ఇంతే మరి!

పరువు ప్రతిష్ఠల పేరిటా, ఔన్నత్య సాంప్రదాయాల పేరిటా చాలా వివాదాలకీ, ఇతర దురదృష్ట సంఘటనలకీ కారణభూతమైన వంశం గురించి గొప్పలు చెప్పుకొనే ముందు, ఒక్క క్షణం ఆగి ఆలోచిస్తే మంచిది.

తల్లి వాస్తవం - తండ్రి ఊహ లేదా నమ్మకం - వంశం భ్రాంతి!

ఓం శ్శాంతిః శ్శాంతిః శ్శాంతిః

★ ★ ★

"నా థీసిస్‌కి ఎన్నుకొన్న విషయంపై నీళ్ళు గుమ్మరించేశావు!" అన్నాడు నిరంజన్ నిరుత్సాహపడిపోతూ.

"అలా హతాశుడివైపోకు. పురాణ పురుషుల మీదా, స్త్రీల మీదా, ముఖ్యంగా భారతం లోని ద్రౌపది మీద వితర్కనీయ విషయాలు-అంటే సిద్ధాంత వ్యాసాలు వ్రాసి, సాహిత్యంలో అనేకమంది డాక్టరేట్ పట్టాలు పొందారు. అయితే విభిన్న వంశాంకురాలకి ఏక క్షేత్రం నుంచి జన్మనిచ్చి వారందర్నీ ఒకే తాటి మీద నడిపించిన కుంతీదేవి మీద థీసిస్ వ్రాయి. ఆ పంచ పాండవులకీ ఒకే భార్యగా ఉప పాండవులకి జన్మనిచ్చిన ద్రౌపది మీద ఓ నూతన దృక్పథంలో థీసిస్ వ్రాయి. సోషల్ సైన్సెస్‌లో నీకు డాక్టరేట్ రావడం తథ్యం!" అన్నాను మరో పెగ్గు లాగిస్తూ.

"వంశ వృక్షం మీద నువ్వు థీసిస్ వ్రాసినా, వ్రాయకపోయినా, వీడు చెప్పిన కథని మట్టుకు నేను 'వంశ భారతం' నవలగా వ్రాస్తాను!" అన్నాడు గౌరీపతి.

నిరంజన్ మళ్ళీ గ్లాసులు నింపి, సీసా ఖాళీ చేశాడు.

('రచన' ఇంటింటి పత్రిక 1998)